క్లుప్తంగా

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

తరిగొప్పుల: మండలంలోని అక్కరాజుపల్లి గ్రామంలో రెయిన్‌బో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ సమీపంలో కూడలి వద్ద ఉన్న ప్రమాదకరమైన మూలమలుపుతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని శుక్రవారం సిమెంట్ కాంక్రీట్‌తో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అంకం రాజు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జొన్నగోని రవీందర్, హరిప్రసాద్, అక్తర్, సాంబరాజు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

లింగాలఘణపురం: లింగాలఘణపురం తహసీల్దార్‌గా జనగామ కలెక్టరేట్‌లో ఏఓగా పని చేసిన పి.రవీందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఇక్కడ పని చేసిన వినయలత హైదరాబాద్ సీసీఎల్‌ఏ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. గత కొంత కాలంగా తహసీల్దార్ వినయలత బదిలీపై వచ్చిన ఊహాగానాలకు దీంతో తెరపడింది.

ఝాన్సీరెడ్డి కోలుకోవాలని పూజలు

పాలకుర్తి టౌన్/కొడకండ్ల: తొర్రూరులో ప్రమాదవశాత్తు స్టేజీ కూలడంతో గాయపడిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమండ్ల ఝాన్సీరెడ్డి త్వరగా కోలుకోవాలని శుక్రవారం పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి, కొడకండ్ల మండల కేంద్రంలోని యోగలింగేశ్వర సహిత రాజరాజేశ్వరి ఆలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, విజేందర్‌రెడ్డి, గిరగాని కుమారస్వామి, ధరావత్ సురేష్‌నాయక్, రాజేష్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రజలు ఆందోళన చెందొద్దు

పాలకుర్తి: తొర్రూరులో గాయపడిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే శుక్రవారం ఫోన్‌లో మాట్లాడుతూ ఝాన్సీరెడ్డి ఆరోగ్యంపై ఆందోళన చెందవద్దని, వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారని అన్నారు. మరికొద్ది రోజుల్లో ప్రజల్లోకి రానున్నారని యశస్వినిరెడ్డి తెలిపారు.

నివాళి




తరిగొప్పుల: మండలకేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కలకుంట్ల వెంకటయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. కాగా, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి, చిలువేరు లింగం, దామెర ప్రభుదాస్, చెన్నూరి సంజీవ, రాజారాం, రామరాజు, జుంలాల్‌నాయక్, రాజేశ్వర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, మహిపాల్ ఉన్నారు.

ఆర్థిక సాయం

మాజీ ఎంపీటీసీ అర్జుల మధుసూదన్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు.

రైతు ధర్నాకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



కొడకండ్ల: పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు డివిజన్ కేంద్రంలో నిర్వహించిన రైతు ధర్నాకు శుక్రవారం బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీని చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సారథ్యంలో చేపట్టిన రైతు ధర్నాకు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు.

పాలకుర్తి: పాలకుర్తి నుంచి రైతు ధర్నాకు తరలివెళ్లిన వారిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, సహకార సొసైటీ చైర్మన్ అశోక్ రెడ్డి, మాచర్ల ఎల్లయ్య, వీరమనేని సోమేశ్వర్‌రావు, ఎడవెల్లి కృష్ణ,కడుదుల కర్నాకర్ రెడ్డి, గోపి ఉన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన జహారాభేగం, అబ్దుల్లా దంపతుల కూతురు జాస్మిన్ వివాహానికి సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ రూ.5వేల సాయం శుక్రవారం అందజేశారు. శ్రీనివాస్, సత్యనారాయణ, నాగభూషణం, కరీం, మోహన్, ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..

పాలకుర్తి: మండలంలోని వావిలాల గ్రామంలో పేద కుటుంబానికి చెందిన దుస్స సత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కోల వేణు ఆధ్వర్యంలో పరామర్శించి రూ.3వేల సాయం అందజేశారు. సూదగాని రాము, సూదగాని రాంమోహన్ తదితరులు ఉన్నారు.

ఆగని ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులు

- స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- బస్టాండ్ వద్ద రోడ్డు దాటలేని పరిస్థితి



స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్‌కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్‌లో ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులు ఆగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధానంగా జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్మించిన డివైడర్లతో స్థానిక బస్టాండ్ వద్ద హైదరాబాద్ నుంచి హనుమకొండ వెళ్లే వాహనాలు బస్టాండ్‌లోకి వచ్చే అవకాశం లేకుండా పోయింది. హనుమకొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులు బస్టాండ్‌లోకి వెళ్తున్నాయి. అయితే హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపునకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులేవీ ఘన్‌పూర్ బస్టాండ్‌లోకి వచ్చే పరిస్థితి లేకుండా అయింది. పలువురు డ్రైవర్లు ఆర్డినరీ బస్సులను సైతం బస్టాండ్‌లోకి తీసుకురాకుండా నేరుగా వెళ్తున్నారు. దాంతో ప్రయాణికులకు ఎక్స్‌ప్రెస్, ఆర్డీనరీ బస్సుల కోసం తిప్పలు తప్పడం లేదు. స్థానిక బస్టాండ్ వద్ద వెహికిల్ అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించడమో, లేదా హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపు వెళ్లే ఏ బస్సులైనా స్థానిక బస్టాండ్ లోకి వచ్చేలా చర్యలు తీసుకోవడం లాంటి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రమాదకరం.. రోడ్డు దాటుదాటడం

స్థానిక బస్టాండ్ వద్ద డివైడర్ ఏర్పాటు చేయడంతో ప్రజలకు రోడ్డు దాటేందుకు కష్టాలు తప్పడం లేదు. హైదరాబాద్ నుంచి హన్మకొండ వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం రోడ్డు దాటేందుకు ప్రతీ రోజూ ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. అసలే పండుగ సీజన్ కావడంతో ఘన్‌పూర్ నుంచి వెళ్లే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఈ క్రమంలో అనునిత్యం ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.



బస్సుల కోసం రోడ్డు దాటుతున్న ప్రయాణికులు

ఈ విషయమై ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టీఎన్జీవోల సంఘం సభ్యత్వ నమోదు



సభ్యత్వం ఇస్తున్న మధు

జనగామ: జిల్లా కేంద్రంలో 2024–25 వార్షిక సంవత్సరానికి సంబంధించి టీఎన్‌జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ ఖాజాషరీఫ్ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదును శుక్రవారం చేపట్టినట్లు పట్టణ కార్యదర్శి మల్లిగారి మధు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలోని నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు టీఎన్‌జీఓ సభ్యత్వం ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనజర్ రాములు, అంజయ్య, వనలేశ్వర్, నర్సయ్య, విజయలక్ష్మి, శరత్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహ హస్తం..

- రూ.70 వేల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

నర్మెట: అనారోగ్యంతో మిత్రుడి భార్య మృతిచెందగా స్నేహితులు అండగా నిలిచి ఆదుకున్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన సత్తయ్య భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందినది. కాగా 1985–86 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు జనగామ మండలం వెంకిర్యాలలో స్నేహితుడిని శుక్రవారం పరామర్శించి రూ. 70 వేల సాయం అందించారు. పరామర్శించిన వారిలో గోపగోని శోభన్ బాబు, నాగంపల్లి శ్రీనివాస్, నీరటి సుధాకర్, ఎండి జావిద్, మల్లాడి శ్రవణ్ కుమార్, గోపగోని యాదగిరి, గుర్రాల దయాకర్ రెడ్డి, చాడవరపు చంద్రకాంత్, తీగుళ్ళ భూపతిరెడ్డి, మడికొండ శేఖర్, బానోత్ మురళి, రమేష్, గోపగోని ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఘనస్వాగతం

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో శుక్రవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు బీఆర్‌ఎస్ మండల నాయకులు ఘనస్వాగతం పలికారు. తొర్రూరులో రైతు రుణమాఫీపై నిర్వహించే ధర్నాలో పాల్గొనేందుకు వెళ్తుండగా నెల్లుట్ల అంబేడ్కర్ విగ్రహం వద్ద శాలువాతో సన్మానించారు. సుధీర్‌రెడ్డి, గండి యాదగిరి, అంతగల్ల రాంచందర్, యాకయ్య, ఊడుగుల భాగ్యలక్ష్మి, రేగు శ్రీనివాసు తదితరులు ఉన్నారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఉన్నారు.



హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

నాలాలపై అక్రమ నిర్మాణాలు తొలగించాలి



జనగామ రూరల్: మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి నాలాలపై ఉన్న అక్రమ నిర్మాణాలు తొలగించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. గోపి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

బచ్చన్నపేట: మండలంలోని సాల్వాపూర్ గ్రామంలో కబ్జా చేస్తున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహిపాల్‌రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో 147/1 సర్వేనంబర్‌లో 29–30 ఎకరాల ప్రభుత్వ భూమిని హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఆక్రమించగా ఇదేమిటని అడిగిన గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని అన్నారు. సంబంధిత అధికారులు అట్టి ప్రభుత్వ భూమిని సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేసి ఆక్రమణకు పాల్పడిన వ్యక్తిపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని కోరారు.

‘హద్దులు నిర్ణయించాకే ప్రహరీ నిర్మించాలి’

చిల్పూరు: సహకార సొసైటీకి ఉన్న స్థలానికి హద్దులు నిర్ణయించిన తర్వాతే ప్రహరీ పనులు మొదలు పెట్టాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా నియోజకవర్గం ఇన్‌చార్జ్ రంగు హరీశ్ గౌడ్, బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు పొలబోయిన జోగులు అధికారులను కోరారు. మండలంలోని శ్రీపతిపల్లి గ్రామంలోని సహకార సొసైటీ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు సంబంధిత అధికారులు సన్నాహాలు చేపట్టగా శుక్రవారం గ్రామ బీజేపీ, బీఆర్‌ఎస్, యువకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొసైటీకి ఉన్న భూమిలో 10 గుంటల వరకు అన్యాక్రాంతం అయిందని, అందుకు పూర్తి స్థాయిలో సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేశాకే పనులు మొదలు పెట్టాలన్నారు. బొల్లు భిక్షపతి, వంగ వివ, పిట్టల సురేష్, ఎస్‌కే పాషా ఉన్నారు.

పిల్లలకు తల్లిపాలు శ్రేయస్కరం



జఫర్‌గఢ్: పిల్లలకు తల్లిపాలు శ్రేయస్కరమని అంగన్‌వాడీ సూపర్ వైజర్ టి.అనిత కోరారు. మండలంలోని హిమ్మత్‌నగర్, కోనాయిచలం తదితర అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాలపై అవగాహన కార్యక్రమంతో పాటు బతకమ్మ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ తల్లిపాలే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యమన్నారు. టీచర్లు విజయలక్ష్మి, రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

గోరీ నిర్మాణం అడ్డగింత

పాలకుర్తి: మండలంలోని శాతపురం గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ స్థలంలో శుక్రవారం కొందరు గోరీ నిర్మిస్తున్న విషయాన్ని అధికారులకు స్థానికులు తెలియజేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు పరిశీలించి గోరీ కట్టడాన్ని అడ్డుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొడకండ్ల: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. సూర్యాపేట జిల్లా తిర్మలగిరి మండలం అనంతారం వాగు నుంచి శుక్రవారం బేతి రమేశ్ అఇసుకను క్రమంగా తరలిస్తుండగా మండలకేంద్ర శివారులో పట్టుకుని కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

రుణమాఫీపై బీజేపీ నేతల వ్యాఖ్యలు సిగ్గుచేటు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: రైతుల రుణమాఫీపై బీజేపీ నేతల వ్యాఖ్యలు, ధర్నాలు చేయడం సిగ్గుచేటని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ నేతల వైఖరిపై ఆయన మండిపడ్డారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ ఏనాడు రైతుల సమస్యలు పట్టించుకోలేదని, రుణమాఫీ చేయలేదన్నారు. అలాంటిది రుణమాఫీపై బీజేపీ నేతలు ధర్నాలు చేయడం కేవలం డ్రామాలేనని, ప్రజల్ని దగా చేయడమే అన్నారు.

ఇందిరమ్మ కమిటీల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం దశలవారిగా పథకాలు అమలు చేస్తుందని, త్వరలో పేదల కోసం నియోజకవర్గానికి 5వేల ఇందిరమ్మ ఇళ్లు అందించనున్నట్లు ఆయన తెలిపారు. అయితే ఇందిరమ్మ కమిటీల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ..

నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 121 మంది లబ్ధిదారులకు రూ.35.88 లక్షలు విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కడియం అందజేశారు. సమావేశంలో సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్నగుప్తా, జూలకుంట్ల శిరీష్‌రెడ్డి, ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి, రజాక్‌యాదవ్, మంచాల ఎల్లయ్య, నూకల ఐలయ్య, నీల గట్టయ్య, కొలిపాక సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

స్టేషన్‌ఘన్‌పూర్‌లో చెట్కూరి బుచ్చమ్మ, నమిలిగొండలో కోల భిక్షపతి, తానేదార్‌పల్లిలో ఆకుల శ్రీనివాస్ కుటుంబాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించి వారి మృతిపట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు.

డిజిటల్ కుటుంబ సర్వే వేగవంతం చేయాలి

రఘునాథపల్లి: డిజిటల్ కుటుంబ సర్వే వేగవంతం చేయాలని జనగామ ఆర్డీఓ కొమురయ్య సూచించారు. మండలంలోని మాధారంలో డిజిటల్ సర్వేను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. ఎన్ని కుటుంబాలు సర్వే చేశారు, కుటుంబ సభ్యులందరిని కలిపి ఫొటో తీస్తున్నారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు దూరంలో ఉన్నా గ్రామానికి వచ్చి ఫొటో దిగేలా సమాచారమందించాలని ఆయన సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్లు, డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి, కారోబార్ రాజేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.



డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ కొమురయ్య

క్రీడల్లో గెలుపోటములు సహజం

చిల్పూరు: క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని క్రీడల నిర్వాహకులు పాగాల సంజనారెడ్డి అన్నారు. మండలంలోని రాజవరంలో దివంగత జెడ్పీ మాజీ చైర్మన్ సంపత్‌రెడ్డి స్మారకార్థం నిర్వహించిన రాజవరం ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) సీజన్–2 క్రికెట్ పోటీలను శుక్రవారం సంజనారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ముందుగా సంపత్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘాల రాష్ట్ర కన్వీనర్ ఇల్లందుల సుదర్శన్, నాయకులు జనగామ యాదగిరి, పంతం రాజు, బత్తుల సూర్యనారాయణ, పాగాల వెంకట్‌రెడ్డి, పాగాల వైష్ణవీరెడ్డి, రంగురవి, ఎడ్ల మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సంజనారెడ్డి

సంపత్‌రెడ్డి విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

రాజవరానికి చెందిన సంపత్‌రెడ్డి విగ్రహ ఏర్పాటుకు కుమార్తె సంజనారెడ్డి, తమ్ముడు పాగాల వెంకట్‌రెడ్డి తదితరులు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదుట విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు.

అంకితభావంతో పనిచేయాలి

తరిగొప్పుల: పార్టీ బలోపేతానికి అంకిత భావంతో పనిచేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ సీనియర్ నాయకుడు చింతల బుచ్చయ్య అధ్యక్షతన శుక్రవారం మండలకేంద్రంలో గ్రామమహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక వర్గం, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కారం కావాలంటే కమ్యూనిస్టు పార్టీ బలోపేతం జరగాలన్నారు. భూక్య చందునాయక్, పొండ్యాల అంజయ్య, మల్లేషం, నర్సయ్య, రమేష్, గట్టయ్య, కుమార్, రవి, రాజు, మహేందర్ పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు ఉపాధి కల్పించాలి

జనగామ రూరల్: పట్టణంలోని వీవర్స్ కాలనీ బీడీ కార్మికులకు ఇండస్ట్రీ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని సీపీఎం పట్టణం కార్యదర్శి జోగు ప్రకాశ్ అన్నారు. 11, 12 వార్డుల్లో నిర్వహించిన సీపీఎం శాఖ మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వార్డు శాఖ కార్యదర్శిగా మచ్చ వరలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చండీయాగం

పాలకుర్తి: నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రారంభం సందర్భంగా చండీయాగం, హోమం శుక్రవారం నిర్వహించారు. పునరుద్ధరణ పనులు పూర్తి చేసిన క్యాంపు కార్యాలయాన్ని ఈనెల 7వ తేదీన ప్రారంభించనున్నారు. ఈ మేరకు వేద పండితుల హోమం, చండీయాగం, ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మాజీ సర్పంచ్‌లు వీరమనేని యాకాంతరావు–సునీత, పోగు శ్రీనివాస్–రాజేశ్వరి, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గోనె మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చండీయాగం చేస్తున్న వేద పండితులు

కళాశాలలో బతుకమ్మ వేడుకలు



వేడుకలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్



వేడుకల్లో విద్యార్థినులు, నాయకులు

జఫర్‌గఢ్: ఎన్ఎస్ఎస్ సేవా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో నిర్వహించారు. ఈ వేడుకలను ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

జనగామ రూరల్: ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు బతుకమ్మ ఆడి పాడారు. జిల్లా కన్వీనర్ సుదగాని సుమ, జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం, లవకుమార్, రమేష్, ఆర్య, మురళి, మానస, ధన్వంతి, సురేఖ ఉన్నారు.

ఘనంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

సాక్షి నెట్‌వర్క్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను భక్తులు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటున్నారు. మండపాల్లో దుర్గాదేవి విగ్రహాలను ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. శుక్రవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఆయా కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీల నిర్వాహకులు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



నర్మెట: పూజలో పాల్గొన్న యూత్ సభ్యులు



బచ్చన్నపేట: కొన్నెలో..



పాలకుర్తి టౌన్: సోమేశ్వరాలయంలో శ్రీగాయత్రి దేవీ అలంకరణలో చండికా అమ్మవారు



రఘునాథపల్లి: మహాదేవస్వామి ఆలయంలో..



స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండలో..



స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లిలో..



పాలకుర్తి టౌన్: మహంకాళి యూత్ ఆధ్వర్యంలో..

రిజర్వాయర్ నీటిలో కొట్టుకుపోయిన పాడిగేదెలు

- నాలుగు మృతి, రెండిటి పరిస్థితి విషమం

రఘునాథపల్లి: అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు వెళ్లే కెనాల్‌కు ఆకస్మాత్తుగా నీరు వదలడంతో ఆరు పాడి గేదెలు కొట్టుకుపోగా, నాలుగు మృతి చెందిన సంఘటన జాఫర్‌గూడెంలో సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జాఫర్‌గూడెం గ్రామానికి చెందిన కావటి మహేందర్ తన ఆరు పాడిగేదెలను కెనాల్ వద్ద మేతకు వదిలాడు. సమీపంలోని అశ్వరావుపల్లి రిజర్వాయర్ వద్ద ఆకస్మాత్తుగా నవాబుపేట రిజర్వాయర్‌లోకి నీటిని వదలడంతో కెనాల్‌లో మేస్తున్న పాడిగేదెలు నీటి ప్రవహానికి కొట్టుకుపోయాయి. రెండు కిలోమీటర్ల దూరంలోని ఖిలాషాపూర్ సమీపంలో నాలుగు పాడి గేదెలు మృతి చెందాయి. మరో రెండు గేదెలు ప్రాణాలతో బయటపడినా వాటి పరిస్థితి విషమంగా ఉంది. మృతి చెందిన నాలుగు పాడిగేదెల విలువ సుమారు రూ. 3లక్షల వరకు ఉంటుందని బాధిత రైతు మహేందర్ రోదిస్తు తెలిపాడు. రిజర్వాయర్ నీటిని ఇష్టారాజ్యంగా ఆకస్మాత్తుగా వదలడంతోనే పాడిగేదెలు మృతి చెందాయని, బాధిత రైతు కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని జాఫర్‌గూడెం రైతులు కోరుతున్నారు.



కొట్టుకుపోతున్న పాడి గేదెలు

ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలికి సన్మానం

పాలకుర్తి టౌన్: స్వచ్ఛతాహీ సేవా–2024 కార్యక్రమంలో భాగంగా ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలిగా ఎంపికైన పాలకుర్తి జీపీకి చెందిన గాదెపాక సుశీలను కలెక్టర్ రిజ్వాన్ బాషా శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డీపీఓ వసంత, ఎంపీడీఓ రాములు పాల్గొన్నారు.

ఎనిమిది మందికి ప్రశంసపత్రాలు

దేవరుప్పుల : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపం లేకుండా విశిష్ట సేవలందిస్తున్నందుకుగాను ఎనిమిది మంది ఎంపీడీఓ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌పాషా షేక్ చేతుల మీదుగా స్వచ్ఛతా హీ సేవా ప్రశంసాపత్రాలను అందుకున్నారు. ప్రశంసపత్రాలు అందుకున్న వారిలో ఎంపీఓ టి.సురేష్‌కుమార్, గ్రామ కార్యదర్శులు ఎ.అంజలి(కామారెడ్డిగూడెం), బి.శివారెడ్డి (పెద్ద మడూరు), బి భాగ్యరాజు (సీర్మాల), గ్రామ పంచాయతీ సిబ్బంది ఎన్ యాకయ్య(చిన్నమడూరు), భిక్షపతి(కోలకొండ), పి.రామచంద్రు(కడవెండి), బి.పద్మ(సీతారాంపురం), ఎం భిక్షమయ్య(సీర్మాల) ఉన్నారు.